

సిఎం సభ విజయవంతంపై మంత్రి కృతజ్ఞతలు

ప్రజాశక్తి-కొవ్వూరు రూరల్

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పర్యటనను విజయవంతం చేసిన ప్రజలు, నాయకులు అధికారులకు హోమ్ మంత్రి తానేటి వనిత కృతజ్ఞతలు తెలిపారు. కొవ్వూరులో జగనన్న విద్యా దీవెన కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ద్వారా ఘనంగా జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. కొవ్వూరులో డిగ్రీ కళాశాల భవనాల నిర్మాణం, నియోజకవర్గంలో మూడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల మరమ్మతులు, మూడు అంబేద్కర్ భవనాలు, ఎస్సి కమ్యూనిటీ హాల్, కాపు భవనం, షాదీఖానా, కొవ్వాడ కెనాల్ మీద కల్వర్టు కోసం నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని కోరినట్టు తెలిపారు. అడిగిన వెంటనే ముఖ్యమంత్రి జగనన్న వీటన్నింటినీ మంజూరు చేస్తూ హామీ ఇచ్చారని హోమ్ మంత్రి తానేటి వనిత వివరించారు.

భూసారం తెలిసేదెలా..?

- మట్టి పరీక్షలను విస్మరించిన ప్రభుత్వం
- పంటలకు పోషకాలందక రైతుల అవస్థలు



ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో పది లక్షల హెక్టార్లలో రైతులు పంటలు సాగు చేస్తున్నారు. గతంలో భూసార పరీక్షలకు అత్యధిక ప్రాధాన్యం లభించడంతో రైతులు భూమిలో ఏ పోషకాలు ఎంత ఉన్నదీ తెలుసుకొని ఎరువులు వాడేవారు. నేలలో పోషకాల లభ్యత తెలుసుకొనేందుకు భూసార పరీక్షలు నిర్వహించాలి. వాటి ఆధారంగా ఎరువులు, రసాయనాలను ఎలా వాడాలో అవగాహన కల్పించాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని రైతులు వాపోతున్నారు. సాధారణంగా మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి నమూనాలను సేకరించి భూ సారాన్ని పరీక్షిస్తారు. ఇలా పొలాల్లో ఏడాదికి ఒకసారైనా మట్టి పరీక్షలు నిర్వహించి భూమికి అవసరమైన పోషకాలు అందిస్తే అధిక దిగుబడులు సాధించడానికి అవకాశముంటుంది. 2019లో ఉమ్మడి జిల్లాలో 62 గ్రామాల్లో 22,368 నమూనాలను సేకరించారు. ఆ తర్వాత సంవత్సరం నుంచి వ్యవసాయ శాఖ మట్టి పరీక్షలకు మంగళం పాడింది. రైతులు ఆర్బికేలకు నమూనాలను తీసుకెళ్తేనే పరీక్షలు చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఏటా సుమారు 6 లక్షల ఎకరాల్లో వరి, పత్తి, మొక్కజొన్న తదితర వ్యవ సాయ పంటలు, 4.25 లక్షల ఎకరాల్లో కొబ్బరి, జీడిమామిడి, ఆయిల్ పామ్, మామిడి, అరటి, కర్రపెండలం, కాయగూరలు, పూలు, పసుపు, బొప్పాయి తదితర ఉద్యాన పంటలు సాగవుతున్నాయి. విత్తనాల కొనుగోలు నుంచి పంట చేతికొచ్చే వరకూ అన్నదాతలు అనేక అవస్థలు పడాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో భూమికి పోషకాలు అందించే విధంగా వ్యవసాయ శాఖ సన్నద్ధం చేయాల్సి ఉంది.

కానరాని పరీక్షలు

భూసార పరీక్షలతో రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని వ్యవసాయ అధికారులు తూతూమంత్రంగా నిర్వహించి చేతులు దులుపుకొన్నారనే విమర్శలు ఉన్నాయి. వాస్తవానికి అధికారులు రైతుల పొలాల వద్దకు వెళ్లి మట్టి నమూనాలను సేకరించాల్సి ఉంది. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత రెండేళ్ల పాటు పరీక్షలు మరిచారు. ఇప్పుడు ఆర్బికెల ద్వారా నిర్వహిస్తు న్నామని చెబుతున్నా అరకొరగానే సాగుతున్నాయి. రైతులకు అవసరం ఉండి నమూనాలను తీసుకెళ్తేనే పరీక్షలు చేస్తున్న పరిస్థితి ఏర్పడింది. అవి కూడా కొన్ని చోట్ల మాత్రమే నిర్వహిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పరీక్షలకు అవసరమైన కిట్లు అందుబాటులో ఉన్నా సిబ్బందికి సరైన శిక్షణ ఇవ్వలేదని ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు పరీక్షలకు కావాల్సిన రసాయనాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచలేదు. దీంతో రైతులు ఆర్బికెలకు వెళుతున్నా నిరాశ తప్పడం లేదు.

పెరుగుతున్న పెట్టుబడులు

భూముల మట్టి తత్వాన్ని బట్టి ఎరువులను ఎంపిక చేసుకుని, వ్యవసాయ నిపుణుల సలహాల మేరకు రసాయనాలను వాడితే రైతులకు మేలు జరుగుతుంది. అయితే ఆ పరిస్థితి క్షేత్రస్థాయిలో లేదు. దీంతో ఎంత ఎక్కువగా రసాయనాలు వాడితే దిగుబడి అంత గణనీయంగా వస్తుందన్న అపోహలతో పలువురు రైతులు పరిమితికి మించి ఎరువులు, రసాయనాలు వాడుతున్నారు. విత్తనం నాటిన నాటి నుంచి దిగుబడి వచ్చే వరకు వివిధ దశల్లో అధిక ఎరువులు, పురుగుల మందులను వినియోగిస్తున్నారు. దీంతో పెట్టుబడులు విపరీతంగా పెరిగిపోతుండగా దిగుబడులు గణనీయంగా తగ్గిపోతున్న పరిస్థితులు నెలకొన్నాయి.

భూసార పరీక్షలు లేవు

మూడేళ్లుగా వ్యవసాయ శాఖ అధికారులు భూసార పరీక్షలు నిర్వహించడం లేదు. దీంతో భూమిలో ఎంత స్థాయిలో పోషక విలువలు ఉన్నాయో తెలుసుకోవడం కష్టంగా ఉంది. విపరీతంగా పురుగుల మందులను వాడాల్సి వస్తోంది. ఆర్బికెల్లో చేస్తున్నామని చెబుతున్నారు. అక్కడికి వెళుతుంటే సిబ్బందికి సరైన అవగాహన లేనట్లుగా కనిపిస్తోంది. -

- కె.రామారావు, కొవ్వూరు మండలం.

భూసార పరీక్షలు నిర్వహిస్తున్నాము

ఏటా వేసవిలో భూసార పరీక్షలు నిర్వహిస్తున్నాము. భూసార పరీక్షలతో భూమిలోని పోషక విలువల పరిమాణంతో పాటు ఎరువులు ఎంత మోతాదులో వినియోగించాలో తెలుస్తుంది. గత కొంతకాలంగా ఆర్బికెల్లోనే పరీక్షలు నిర్వహిస్తున్నాము. రైతులు మట్టినమూనాలను తీసుకొస్తే వాటిని అక్కడే పరీక్షించి వివరాలు వెల్లడిస్తాము. ఇంటిగ్రేటెడ్ ల్యాబ్స్ అందుబాటులోకి రావడంతో భూసార పరీక్షల సేవలు మరింత విస్తృతం కానున్నాయి

- ఎస్.మాధవరావు,అగ్రికల్చర్ జెడి, తూర్పుగోదావరి జిల్లా.

పాలనా అంశాలపై సిఎస్ సమీక్ష

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

పలు పాలనా అంశాలపై గురువారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్.జవహర్ రెడ్డి వెలగపూడి నుంచి కలెక్టర్లతో టిలికాన్ఫరెన్స్ నిర్వహించారు. జెకెసి, వైద్య ఆరోగ్య, స్కూల్స్‌లో నాడు-నేడు, స్పందన రీ ఓపెన్ అర్జీలు, ఆడుదాం ఆంధ్రా తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. జగనన్నకు చెబుదాం అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. స్పందన అర్జీలు తిరిగి రాకుండా పరిష్కారం తీసుకోవాలని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ కే. మాధవీలత మాట్లాడుతూ మొత్తం జెకెసి 1902 నంబర్‌కు 20,745 కాల్స్ వచ్చాయన్నారు. వాటిలో ప్రభుత్వ పథకాలపై 5328, పథకాలకు సంబంధం లేనివి 3,096, సాధారణ కాల్స్ 12,051 వచ్చాయని తెలిపారు. జెకెసికి వస్తున్న అర్జీలను రాష్ట్ర సగటు కంటే ముందుగా పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జగనన్నకు చెబుదాం, స్పందన అర్జీల విషయంలో సంతృప్తి స్థాయిలో పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. క్షేత్ర స్థాయిలో ఫ్యామిలీ కాన్సెప్ట్ ద్వారా పరీక్షలు నిర్వహిస్తునట్లు తెలిపారు.

స్కూల్స్ ప్రారంభం అయ్యే నాటికి నాడు-నేడు పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ మాధవీలత తెలిపారు. జగనన్న విద్యా కిట్లు, షూలు, బ్యాగ్స్, డ్రెస్‌లు పుస్తకాలు విద్యార్థులకు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని మాధవీలత తెలిపారు.

స్పందన రీ ఓపెన్‌కు సబంధించి జిల్లాలో 18 అర్జీలు వచ్చాయని కలెక్టర్ డాక్టర్ మాధవీలత తెలిపారు. ఆయా అర్జీలను శాఖల వారీగా సమీక్షించి పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆడుదాం ఆంధ్రా.. కింద జిల్లాలో గ్రామ, మండల, నియోజక వర్గ, జిల్లా స్థాయిలో క్రీడా పోటీలను నిర్వహిస్తామని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్, సహాయ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, ఎఎస్‌పి పంకజ్ కుమార్ మీనా, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఫార్మా కంపెనీపై అభిప్రాయ సేకరణేదీ..

ప్రజాశక్తి-గోపాలపురం



గ్రామస్తులతో చర్చిస్తున్న పోలీసులు, ఫార్మా ప్రతిధులు

సగ్గొండ పంచాయతీ గంగోలు రెవెన్యూ పరిధిలో ఫార్మా కంపెనీ నిర్మాణం కోసం ప్రజాభిప్రాయ సేకరణ చేయక పోవడంతో గ్రామస్తులు గురువారం ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో దేవరపల్లి సిఐ అనసూరి శ్రీనివాసరావు, ఎస్‌క్మి కె.రామకృష్ణ తమ సిబ్బందితో పంచాయతీ కార్యాలయానికి చేరుకున్నారు. గ్రామస్తులు మాట్లాడుతూ గోపవరం గ్రామానికి అతి సమీపంలో నిర్మాణం చేస్తున్న ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా ఈ నెల 20న పెద్ద ఎత్తున నిరసన తెలిపామన్నారు. గోపాలపురం సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి గురువారం సభ ఏర్పాటు చేస్తామని తెలిపారని, కానీ గ్రామసభ ఏర్పాటు చేయలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో సర్పంచ్ ఎండపల్లి శేఖర్ బాబు, పంచాయతీ కార్యదర్శి అనురాధ, ఫార్మా కంపెనీ యాజమాన్యం సమక్షంలో గ్రామస్తులతో చర్చలు ఏర్పాటు చేశారు. గ్రామసభ వచ్చేనెల 5న ఏర్పాటు చేస్తామని ప్రజాభిప్రాయలు, తుది నిర్ణయం తీసుకుంటామని వారు తెలిపారు.

26న వార్డు కార్యదర్శులకు పరీక్షలు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

గ్రామ, వార్డు కార్యదర్శులకు కంప్యూటర్ నైపుణ్యంపై ఎపి పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా మే 26 ఆన్‌లైన్ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు డిఆర్‌ఒ జి.నరసింహులు తెలిపారు. గురువారం తన ఛాంబర్‌లో పరీక్షల నిర్వహణపై సమన్వయ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహులు మాట్లాడుతూ కారుణ్య నియామకాల కింద నియమించబడిన రెవెన్యూ, పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ శాఖల తరపున గ్రామ, వార్డ్ సచివాలయాల్లో విధులు నిర్వర్తించే ఉద్యోగులకు కంప్యూటర్ నైపుణ్యంపై పరీక్షలను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ పరీక్షలను నాలుగు షిఫ్ట్‌లుగా నిర్వహిస్తారనన్నారు.

రచయితల సంఘం ఉపాధ్యక్షునిగా పృథ్వి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఉపాధ్యక్షునిగా అభ్యుదయ రచయితల సంఘం (అరసం) ప్రధాన కార్యదర్శి ఎస్ఆర్. పథ్వి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అరస జిల్లా అధ్యక్షులు పడాల వీరభద్రరావు, కార్యదర్శి బిహెచ్‌వి.రమాదేవి అభినందనలు తెలిపారు. గుంటూరు కేంద్రంగా ఉన్న ఎపి రచయితల సంఘంలో ఎస్ఆర్.పథ్వి గతంలో పలు బాధ్యతల్లో పని చేశారు. ఆదివారం గుంటూరు అన్నమయ్య గ్రంథాలయంలో జరిగిన సంఘం ఎన్నికల్లో పథ్విని తిరిగి ఉపాధ్యక్ష పదవికి ఎన్నుకున్నారు.

భవానీ శంకర్‌కు ఎంపీ భరత్ నివాళి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

బూరాడ భవానీ శంకర్‌కు ఎంపీ మార్గాని భరత్ రామ్ ఘనంగా నివాళు లర్పించారు. గురువారం నగరంలోని సంజీవయ్య నగర్‌లో బూరాడ భవానీ శంకర్ పెద్ద కార్యంలో ఎంపీ భరత్ పాల్గొని కుటుంబ సభ్యులతో కొద్ది సేపు మాట్లాడారు. ఎంపీ భరత్ వెంట నగర పార్టీ అధ్యక్షుడు అడపా శ్రీహరి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ట్రేడ్ యూనియన్ నేత ఎన్వీ శ్రీనివాస్, అరిఫ్, పీత రామకష్ణ,హబిబుల ఖాన్, గుతుల మురళి, మనే దొరబాబు పాల్గొన్నారు.

రెజ్లర్లకు న్యాయం చేయాలని ఆందోళన

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం



శ్రీనివాస్‌ను పరామర్శిస్తున్న ఎంఎల్ఏ శ్రీనివాస్ నాయుడు

దేశ రాజధాని ఢిల్లీలో ఆందోళన చేస్తున్న రెజ్లర్ల డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని, ఇందుకు కారకుడైన బ్రిజ్ భూషణ్‌ను తక్షణం తొలగించాలని ఎల్ఐసి ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. గురువారం భోజన విరామ సమయంలో ఇన్నీసుపేటలోని ఎల్ఐసి కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సంఘం మహిళా కన్వీనర్ శిరీష మాట్లాడుతూ బిజెపి ఎంపీగా ఉన్న బ్రిజ్ భూషణ్‌ను తక్షణమే ఇండియన్ రెజ్లర్ ఫెడరేషన్ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఆడపిల్లలపై జరుగుతున్న అత్యాచారాలను అందరూ ఖండించాలని ఆమె పిలుపునిచ్చారు. నాలుగు నెలలుగా మహిళలు చేస్తున్న పోరాటానికి దేశవ్యాప్తంగా ఉన్న ఎల్ఐసి ఉద్యోగుల సంఘం తరపున సంఘీభావం తెలుపుతున్నామని అఖిల భారత ఎల్ఐసి ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు పి.సతీష్ తెలిపారు. ఉభయ గోదావరి జిల్లాల ఉద్యోగుల సంఘం నాయకులు గుబ్బల రాంబాబు, ఎం.కోదండరామ్, పి.సుబ్బారావు, సత్యదేవ, శ్రీను, రమేష్, రాజు, రామకష్ణ, విజయ దుర్గ శ్రీదేవి గాయత్రి తదితరులు పాల్గొన్నారు.



శ్రీనివాస్‌ను పరామర్శిస్తున్న ఎంఎల్ఏ శ్రీనివాస్ నాయుడు

శ్రీనివాస్‌కు ఎంఎల్ఏ పరామర్శ

ప్రజాశక్తి-పెరవలి

మండలంలోని ఉసులుమర్రుకు చెందిన వైసిపి నాయకుడు దవులూరి శ్రీనివాస్ తండ్రి ఇటీవల మృతి చెందారు. దీంతో వారి కుటుంబ సభ్యులను స్థానిక ఎంఎల్ఏ జి.శ్రీనివాస్ నాయుడు గురువారం పరామర్శించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట వైసిపి నాయకులు వీరమల్లు సత్యనారాయణ, ఎంపిపి కె.సీతారాం ప్రసాద్, రామడుగు సూర్యనారాయణ ఉన్నారు.

గ్రామ వాలంటీర్ పోస్టుల భర్తీ

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలో ఖాళీ అయిన గ్రామ వాలంటీర్ పోస్టులకు గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించినట్టు ఇఒపిఆర్‌డి ముత్యం వీరాస్వామి నాయుడు పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఈ ఇంటర్వ్యూల్లో 6 వాలంటీర్ల పోస్టులన భర్తీ చేసినట్టు ఆయన తెలిపారు. ఎంపిడిఒ ఎ.శ్రీనివాస్‌తో కలిసి ఇంటర్వ్యూలు నిర్వహించినట్టు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు మంగళవారం నుంచి విధులకు హాజరవుతారన్నారు.

విద్యుత్ పొదుపుపై అవగాహన

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

విద్యుత్తు పొదుపు చేయడం అంటే విద్యుత్తు ఉత్పత్తి చేసినట్లేనని ఎంపిడిఒ ఎ.శ్రీనివాస్ సిబ్బందికి అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వ పర్యావరణ, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమంలో భాగంగా గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బందికి విద్యుత్ పొదుపుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిబ్బంది ఎవరైనా తమ పని ప్రదేశాల నుంచి బయటకు వెళ్లే సమయంలో విద్యుత్ బల్బులు, ఫ్యాన్లు, స్విచ్ ఆఫ్ చేసి వెళ్లాలని, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ విధంగా పాటించేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ముత్యం వీరాస్వామి నాయుడు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం

ప్రజాశక్తి-పెరవలి

ముక్కామల శాఖా గ్రంథాలయంలో గురువారం 'వేసవి విజ్ఞాన శిబిరం' 18వ రోజుకు చేరింది. రిసోర్స్‌పర్సన్ ఎ.అస్మిత విద్యార్థులతో నీతి కథలు చదివించడం పుస్తక సమీక్ష చేయించారు. కె.వెంకటేశ్వర్లు ఇంగ్లీష్ స్టోరీ పుస్తకాలు చదివించారు. ఉపాధ్యాయులు కె.ప్రసాద్ విద్యార్థులకు సౌర కుటుంబం గురించి వివరించారు. అనంతరం క్విజ్ పోటీ నిర్వహించారు. విరామ సమయంలో విద్యార్థులకు కేక్స్ అందజేశారు. కరటూరి విశ్వనాథం యోగా చేయిం ఆరు. లైబ్రేరియన్ ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం


డాక్టర్ వైఎస్సార్ సంచార పశుఆరోగ్య సేవా రథాల్లో పశు వైద్యులు, పారావేట్‌లు, డ్రైవర్లుగా పని చేసేందుకు ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని సంయుక్త సంచాలకులు డాక్టర్ ఎస్‌టిజి సత్య గోవింద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు సంచార పశు సేవా రథాల మేనేజర్ రమేష్ రావును 6260624232 నెంబరులో సంప్రదించాలన్నారు.

పాలకులకు సమస్యలు పట్టవా..

ప్రజాశక్తి-కొవ్వూరు రూరల్

పర్యటనల పేరుతో రూ.కోట్ల ప్రజాధనాన్ని ఖర్చు చేస్తారు గానీ ప్రజల సమస్యలు తెలుసుకోరా అని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుందరబాబు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సిఎం పర్యటన సందర్భంగా భవన నిర్మాణ కార్మికుల సమస్యలు తెలపడానికి రమ్మని తిరస్కరించడంపై గురువారం బస్టాండ్ సెంటర్లో భవన నిర్మాణ కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దుకూరి దొరయ్య మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇసుక నిలిపివేసి కార్మికుల ఉపాధికి దెబ్బ కొట్టిందన్నారు. కోవిడ్ కాలంలో భవన నిర్మాణ కార్మికుల బోర్డులో నిధులున్నా ఒక రూపాయి కూడా కార్మికులకు ఖర్చు చేయలేదన్నారు. జిఒ నెంబర్ 1214 విడుదల చేసి రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు అందే అన్ని పథకాలను నిలిపివేసిందన్నారు. ఈ నాలుగేళ్లుగా రాష్ట్రవ్యాప్తంగా అనేక పని ప్రదేశాల్లో కార్మికులు ప్రమాదం జరిగి చనిపోవడం, అంగవైకల్యానికి గురి కావడం, హాస్పిటల్ పాలవడం, కార్మికుల పిల్లలు పెళ్ళికి, డెలివరీ ఇవ్వాల్సిన డబ్బులు ప్రభుత్వం నిలిపేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఈ కార్యక్రమంలో జొన్నల రాంబాబు, మాణిక్ రెడ్డి హరి బాబు, సిద్దిరెడ్డి బాపిరాజు, జాస్తి శివరామకష్ణ, నందం కొండబాబు, వెన్న శివ, టి.రాము, ఎస్.శ్రీను కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



కుర్చీల్లేని కార్పొరేషన్ పదవులు.. నిధుల్లేని నామినేటెడ్ పదవులు.. ఇవే కద్సార్..!!

వాలంటీర్లకు పురస్కారాల అందజేత

ప్రజాశక్తి-కడియం, రాజ మహేంద్రవరం రూరల్



పురస్కారాలు అందుకున్న వాలంటీర్లు

కడియం మం డలంలోని ముం ముండ, దుళ్ళ గ్రామాల్లో వాలంటీర్లకు గురువారం వైసిపి రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా చందన మట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకూ మధ్య వాలంటీర్లు వారధులుగా పని చేస్తున్నారని ప్రశంసించారు. రాబోయే కాలంలోనూ వీరు ప్రజలకు మరిన్ని సేవలు అంద జేయాలని చందన కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు, జెసిఎస్ కన్వీనర్ తాడాల చక్రవర్తి, జేగురుపాడు సర్పంచ్ యాదల స్టాలిన్, మురముండ సర్పంచ్ రుక్మిణీ వెంకటేశ్వర్లు, ఈలి గోపాలం, దుళ్ళ ఉప సర్పంచ్ తోకల శ్రీను, ఎంపిటిసి మెల్లిమి మంగ, ఎంపిటిసి సాపిరెడ్డి కామేష్, గారపాటి బుజ్జిబాబు, దీన దయాళ్, తాతపుడి బాబీ, ఊటుకూరి శైలజ, కొత్తపల్లి శివాజీ పాల్గొన్నారు.

ధవళేశ్వరంలోని జక్కంపూడి కళ్యాణ మండపంలో సెక్రటరీ సూరిబాబు అధ్యక్షతన వాలంటీర్లకు వైసిపి రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ సేవా మిత్ర పురస్కారాలు అందజేశారు.

టిడిపి మహానాడుపై ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం



గ్రామస్తులతో చర్చిస్తున్న పోలీసులు, ఫార్మా ప్రతిధులు

తెలుగుదేశం పార్టీ మహానాడుకు సంబంధించి పార్టీ పార్లమెంటరీ మహిళ కమిటీ అధ్యక్షురాలు మాలే విజయలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. స్థానిక తిలక్ రోడ్డులోని పార్టీ కార్యాలయం దగ్గర నుంచి స్థానిక మహిళలకు బొట్టు పెట్టి మహానాడు కార్యక్రమానికి రావాలని ఆహ్వానం పలికారు. ఇంటింటికీ తిరిగి మహిళలకు నుదిటిన బొట్టు పెట్టి సాదరణంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా మాలే విజయలక్ష్మి మాట్లాడుతూ ఈ దఫా మహానాడు కనీవినీ ఎరుగని రీతిలో చరిత్రలో నిలిచిపోయే విధంగా జరుగుతుందన్నారు. నగర పరిధిలో ఉన్న 42 డివిజన్లలోని ప్రతి మహిళను కలిసి బొట్టు పెట్టి మహానాడుకు హాజరుకావాలని ఆహ్వానం పలుకుతున్నా మన్నారు. నగర మహిళ కమిటీ అధ్యక్షురాలు కోసూరి చండీప్రియ మాట్లాడుతూ తమ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న మహానాడుకు అత్యంత ప్రాధాన్యత నంచరించుకోనుందన్నారం. లక్షలాదిగా హాజరై మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర అంగన్ వాడీ కమిటీ అధికార ప్రతినిధి కప్పల వెలుగు కుమారి, ద్వారా పార్వతి సుందరి, తురకల నిర్మల, కాకర్ల సుజనా చౌదరి, మీసాల నాగమణి, నందూరి పుష్పావ పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న తిరుమలరావు

టిఎస్ ఎంసెట్‌లో తిరుమల విజయకేతనం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

తెలంగాణ ఎంసెట్ అగ్రికల్చర్ అండ్ మెడికల్ ఫలితాల్లో తిరుమల ఐఐటి అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్టు సంస్థల చైర్మన్ తిరుమలరావు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో బిఎస్ఆర్.జశ్వంత్ ప్రథమ ర్యాంకు, సుహాంత్ 41వ ర్యాంకు, కెజిఎం. శంకర్, అజయ్ 52వ ర్యాంకు, ఎస్‌హెచ్‌డి. అనిరుద్ 90వ ర్యాంకు, వై.గణేష్ తేజ 180వ ర్యాంకు, పిఎస్ఎస్.గోపీనాథ్ 182వ ర్యాంకు, ఎం.గంగాతల్లి 184వ ర్యాంకు, కెవిఎన్.క్రాంతి 263వ ర్యాంకు, ఎం.శృతి 266వ ర్యాంకు, టిపిఎల్.సత్య 276వ ర్యాంకు, ఎం.అమత 278 ర్యాంకు, కెఎల్.సాయిశ్రీ 313వ ర్యాంకు, సిహెచ్ఎస్‌కె.శ్రీనివాసిని 327వ ర్యాంకు, జి.ఎస్.చందన 421వ ర్యాంకు, డిపిఎస్-ఎస్.రిష్మిత 425వ ర్యాంకు, పి.తనూశ్రీ 436వ ర్యాంకు, బిఎన్.సిద్దేష్ 444వ ర్యాంకు, పి.లిఖితరాణి 460వ ర్యాంకు సాధించారు. 100 లోపు 4 ర్యాంకులు, 500 లోపు 18 ర్యాంకులు, 1000లోపు 32 ర్యాంకులు సాధించారని తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలియజేశారు.విద్యార్థులను అకడమిక్ డైరక్టర్ జి.సతీష్ బాబు, ప్రిన్సిపల్ వి.శ్రీహరి అభినందించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి కర్తవ్యం

ప్రజాశక్తి- గోకవరం

మండలంలోని మల్లవరం పంచాయతీలో పర్యావరణ పరిరక్షణపై గురువారం అటవీ సెక్షన్ అధికారి పి.వెంకట్రావు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ విడుదల లక్ష్మి ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ మన జీవన విధానంలో కొన్ని మార్పులు చేసుకోవడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చునన్నారు. భూమి నీరు గాలి చెట్లు జీవ జంతు జాతులు రూపంలో మన చుట్టూ ఉన్న ప్రకతికి మనమే హాని చేస్తున్నామని తెలిపారు. రోజువారీ జీవన విధానంలో మన ప్రకతిని కాపాడుకోవాలని ప్లాస్టిక్ వాడడం తగ్గించాలని, వాడిని ప్లాస్టిక్ ను ఎక్కడ పడితే అక్కడ వేయడం వల్ల భూమిలో నిల్వ ఉండిపోయి భూమి ఉత్పాదన శక్తిని తగ్గిస్తున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో విడుదల అర్జున్ రావు, లంక శ్రీను, గోకాడ చిట్టిబాబు, మెరిసే పెద్దబ్బు, శిరందాస్ రాజు, పైలా కల్యాణ్, అటవీ సిబ్బంది కామేశ్వరరావు, రాజీ, రమేష్, ఝాన్సీ, అరుణ పాల్గొన్నారు.

మంత్రి వనితకు పలువురి అభినందన

ప్రజాశక్తి-కొవ్వూరు రూరల్

కొవ్వూరులో సిఎం వైఎస్.జగన్ పర్యటన విజయవంతం, నియోజకవర్గ అభివృద్ధికి సిఎం హామీలు ఇవ్వడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ పలువురు ప్రజా ప్రతినిధులు, వివిధ సామాజిక వర్గాల నాయకులు మంత్రి వనితను కలిసి అభినందనలు తెలిపారు. మంత్రి వనిత విజ్ఞప్తి మేరకు డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి రూ.30 కోట్లు, 3 లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు, కొవ్వాడ కెనాల్ వద్ద కల్వర్ట్, మూడు మండలాల్లో అంబేద్కర్ భవనాలు, ముస్లిములకు షాదీఖానా, ఎస్సిలకు కమ్యూనిటీ హాలు, కాపు కళ్యాణ మండపం నిర్మాణానికి ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భావన రత్నకుమారి, నియోజకవర్గ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలకు నలుగురు ఎంపిక

ప్రజాశక్తి-చాగల్లు

చాగల్లు గ్రామ శివారు ఇందిరమ్మ కాలనీ ప్రాథమిక పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎపి రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలకు ఎంపికైనట్ల పాఠశాల హెచ్ఎం బొల్లిపో మధుశేఖర్ తెలిపారు. విద్యార్థులు మల్లవరపు పల్లవి, కుంజం మోహన, శ్రావ్య, బొంట్ల దేవీశ్రీ సౌమ్య గంటా సౌమ్య ఎంపికైనట్లు మధు శేఖర్ తెలిపారు.

రోడ్డు నిర్మాణ నాణ్యతపై తనిఖీ

ప్రజాశక్తి-గోపాలపురం

రోడ్డు నిర్మాణం నాణ్యనా ప్రమాణాలతో చేపట్టాలని క్వాలిటీ కంట్రోల్ ఇఇ ఏడుకొండలు, పంచాయతీరాజ్ డిఇ ధర్మరాజు సూచించారు. గురువారం మండలంలో నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణ పనులను క్వాలిటీ కంట్రోల్ అధికారులు పరిశీలించారు. అనంతరం జరిగిన పనులకు సంబంధించి రోడ్డులకు శాంపిల్ తీసి అక్కడే పరీక్షలు నిర్వహించారు. కృష్ణకుమారి, రాధాకృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఎలుకల మందు తాగిన విద్యార్థిని మృతి

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

టెన్త్ పరీక్షల్లో రెండు సబ్జెక్టులు ఫెయిల్ ఆయ్యాయనని మనస్థాపం చెందిన ఎలుకల మందు సేవించిన ఒక విద్యార్థిని చికిత్స పొందుతూ కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రిలో మృతి చెందిందని సామర్లకోట పోలీసులు తెలిపారు. మండలంలోని ఉండూరు గ్రామానికి చెందిన విద్యార్థిని ఇటీవల టెన్త్ పరీక్షలు రాయగా, రెండు సబ్జెక్టులు ఫెయిల్ ఆయిన కారణంగా మానసిక వేదనతో ఈ నెల 23న ఇంట్లో ఉన్న ఎలుకల మందు సేవించి ఆత్మహత్యకు యత్నించింది. బంధువులు ఆమె చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ 24వ తేదీన మరణించినట్లు చెప్పారు. విద్యార్థిని తండ్రి బసవ రమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వే స్టేషన్‌లో దొంగ అరెస్టు

రూ. 2 లక్షల సొత్తు స్వాధీనం

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట రైల్వే స్టేషన్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న దొంగను రైల్వే పోలీసులు అరెస్ట్ చేసి అతని నుంచి రూ. 2.03 లక్షలు విలువచేసే బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు సామర్లకోట రైల్వే జిఆర్‌పి ఎస్ఐ బి లోవరాజు తెలిపారు. కాకినాడ పట్టణం రామకృష్ణారావుపేటకు చెందిన వెల్లూరి శివ సాయిసామర్లకోట రైల్వే స్టేషన్ ఒకటో నెంబర్ ప్లాట్‌పామ్ కాలిబాట వంతెని వద్ద అనుమానాస్పదంగా తిరుగుతూండడంతో రైల్వే పోలీసుల అతనిని అదుపులోకి తీసుకుని విచారించగా అతని వద్ద 24 గ్రాముల బంగారం నల్లపూసల దండ, 32 గ్రాముల బం గారు పుస్తెలతాడు, మంగళసూత్రం, మరో రూ.18వేలు విలువచేసే సెల్ ఫోను, మరో కేసులో రూ.20 వేలు మొత్తం రూ. 2.03 లక్షలు రికవరీ చేసి నట్టు చెప్పారు. వాటిని చోరీ సొత్తుగా నిర్ధారించి శివ సాయిని విజ యవాడ రైల్వే కోర్టుకు జ్యుడీషియల్ కస్టడీకి అప్ప గించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్న ట్టు సామర్లకోట రైల్వే జిఆర్‌పి ఎస్ఐ బి.లోవరాజు తెలిపారు.

పేకాడుతున్న 10 మంది అరెస్టు

ప్రజాశక్తి - అన్నవరం

అన్నవరం మెయిన్ రోడ్‌లో ఓ ప్రైవేట్ లాడ్జిలో పోలీసులు జరిపిన దాడుల్లో పేకాట ఆడుతున్న పది మందిని అదుపులోకి సుమారు రూ.లక్షా 16 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు అన్నవరం పోలీ సులు తెలిపారు బుధవారం లాడ్జిలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం మేరకు కాకినాడ చెందిన స్పెషల్ బ్రాంచ్ పోలీసులు దాడులు నిర్వహించారు. దాడిలో ఏలేశ్వ రానికి చెందిన తొమ్మిది మంది, అన్నవరం గ్రామానికి చెందిన ఒకరు ఉన్నట్టు తెలిపారు ఈ పది మందితో పాటు లాడ్జ్ నిర్వాహకుని అదుపులో తీసుకుని కేసు నమోదు చేసినట్టు ఎఎస్ఐ అజయ్‌బాబు తెలిపారు.

సారాతో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మండల పరిధిలోని జె తిమ్మాపురం గ్రామ శివారు లో గురువారం నిర్వహించిన దాడుల్లో 5 లీటర్ల సారా తో వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ ఈ బి సిఐ కెవి స్వామి తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ వై.నాగేంద్ర కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

విద్యార్థులకు బదులు ఇంటర్ పరీక్ష రాసిన వైనం

ప్రజాశక్తి-మండపేట

మండపేటలో ముగ్గురు విద్యార్థులకు బదులు మరో ముగ్గురు ఇంటర్మీడియట్ పరీక్షలు గురువారం రాశారు. ఈ ఘటనలో పరీక్షలు రాసిన వారిపై పోలీసులు కేసు నమోదుచేశారు. జిల్లా ఇంటర్మీడియట్ బోర్డు రాజమహేంద్రవరం ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి ఎన్ఎస్‌విఎల్.నరసింహం తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ అడ్వాన్స్ డు సప్లిమెంటరీ ద్వితీయ సంవత్సరం ఇంగ్లిషు పరీక్షకు పట్టణంలోని ప్రయివేటు కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులకు బదులుగా మరో ముగ్గురు విద్యార్థులు పరీక్షలు రాసేందుకు ప్రయత్నిస్తుంచారన్నారు. అయితే వారి హాల్ టికెట్లను పరిశీలించిన సిబ్బంది వారిని గుర్తించి పట్టణ పోలీస్ స్టేషన్ కు అప్పగించామన్నారు. పరీక్ష రాసేందుకు ప్రయత్నించిన ముగ్గురు పి.హేమంత్, సిహెచ్.జయవర్ధన్, వి. ఆశాలతలపై పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ ఐ అశోక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిట్టీల కేసులో అయిదుగురికి రిమాండ్

ప్రజాశక్తి-చాగల్లు

చాగల్లు మండలం బ్రాహ్మణగూడెం గ్రామంలో చిట్టీల కేసులో 20 మంది బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వల్లభని వెంకాయమ్మ, వారి కుటుంబ సభ్యులను గురువారం అరెస్ట్ చేశామని ఎస్ఐ సిహెచ్‌వి.రమేష్ తెలిపారు. అరెస్ట్ చేసిన వారిని కోర్టులో మేజిస్ట్రేట్ ముందు హాజరపరచగా 15 రోజులు రిమాండ్ విధించినట్లు ఆయన తెలిపారు.

ప్లాస్టిక్ గొడౌన్‌పై దాడి

ప్రజాశక్తి-రామచంద్రపురం

పట్టణంలోని పలుచోట్ల ప్లాస్టిక్ కవర్లు, గొడౌన్‌లపై అధికారులు దాడులు జరిపారు. మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు పోతుల వారి వీధి నందు ఒక గొడౌన్ లో దాచి ఉంచిన అధిక మొత్తంలో ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. గొడౌన్ యజమానికి పలుమార్లు గతంలో ప్లాస్టిక్ నిషేధం గురించి తెలియ చేసినా ప్లాస్టిక్ వాడుతున్నందున పలుమార్లు అపరాధ రుసుం వసూలు చేశామన్నారు. మూడు నెలలుగా నిఘా ఉంచి సచివాలయ శానిటేషన్ ఎన్విరాన్మెంట్ సెక్రట రీలు ఇచ్చిన సమాచారం మేరకు అధిక మొత్తంలో నిల్వచేసే ఉన్న ప్లాస్టిక్ కవర్ల సరుకును గుర్తించి దాడి చేసి పట్టుకున్నమని శానిటరీ ఇన్‌స్పెక్టర్ డేవిడ్ రాజు తెలియ జేశారు.

గోదావరిలో గల్లంతైన వ్యక్తి మృతి

ప్రజాశక్తి-ఆత్రేయపురం

బొబ్బర్లంక గ్రామ శివారు పిచ్చుకలంక వద్ద బ్యారేజీ దిగువన గౌతమి గోదావరిలో స్నానం చేస్తూ గల్లంతై వ్యక్తి మృతి చెందాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు ఇవి.. నిడదవోలు మండలం తాడిమల్లకు చెందిన బి.వీరస్వామి తన స్నేహితులతో గురువారం గోదావరి లో స్నానానికి దిగారు. వీరాస్వామి స్నానం చేసే ప్రదేశంలో ఊబి ఉండడంతో ప్రమాదవశాత్తు గల్లంతై మునిగి పోయాడు. స్నేహితులు సురక్షితంగా బయట పడ్డారు. స్థానికులు గాలింపు చేపట్టగా మృతదేహం లభ్యమైంది. మృత దేహానికి పంచనామ నిర్వహించి కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ సిహెచ్.సుధాకర్ తెలిపారు

యానాం వార్తలు

ఎస్‌పి రఘునాయగంకు సిడిసి బాధ్యతలు

ప్రజాశక్తి - యానాం

యానాం ఎస్‌పి రఘునాయగంకు కరెంట్ డ్యూటీ చార్జిస్(సీడీసీ) కొనసాగిస్తూ పుదుచ్చేరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ వర్మ ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటివరకూ ఎస్‌పి స్థాయి విధులు నిర్వహస్తున్న రఘునాయగానికి పే అండ్ అలెవెన్స్ సెస్ సైతం లెఫ్టినెంట్ గవర్నర్ జారీ చేసిన ఆదేశాల ప్రకారం ఉంటాయని ఆదేశాల్లో పేర్కొన్నారు. అదేవిధంగా బాలచంద్రను సిగ్మా సెక్యూరిటీ, శర్వణన్కు హెూమ్ గార్డ్స్, భక్తవత్సలంకు నార్త్ సబ్ డివిజిన్, యు. రాజ శేఖరన్‌కు కమాండెంట్ పిఎపిల్లో కరెంట్ డ్యూటీ చార్జెస్‌ను కొనసాగిస్తూ ఆదేశాలిచ్చారు.

విద్యార్థులకు యుడిసి స్టడీ మెటీరియల్ అందజేత

ఆదిద్రావిడ శాఖ ఆధ్వర్యంలో ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు యుడిసి ఉద్యోగాల రాతపరీక్షకు శ్రీనివాస్ కోచింగ్ సెంటర్ ఆధ్వరంలో ఇస్తున్న కోచింగ్ తరగతులకు సంబంధించి స్థానిక ఆర్ఎఒ ఛాంబర్‌లో గురువారం విద్యార్థులకు ఆర్ఎఒ మునిస్వామి స్టడీ మెటీరియల్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించిన రాతపరీక్షలో ముఖ్యమైన కరెంట్ ఎఫైర్స్, మేథ్స్, సైన్స్, హిస్టరీ, రాజ్యాంగం తదితర అంశాలపై శ్రద్ధ పెట్టాలని ఆయన విద్యార్థులకు సూచించారు.పోటీ పరీక్షల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు.

పలువురికి అనిత పరామర్శ

యానాం ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని స్థానిక అంబేద్కర్ నగర్ మహిళా నాయకురాలు అనిత గురువారం పరామర్శించారు. ఈ మేరకు రోగుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం బుధవారం రాత్రి ప్రమాదానికి గురైన కోరంగి గ్రామానికి చెందిన మట్టపర్తి శ్రీనివాస్ ను ఆమె పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని ఆస్పత్రి సిబ్బందిని కోరారు.



సిరిపురంలో కొండల శ్రీను ఇంటిముందు నిరసన తెలుపుతున్న శ్రీదేవి, కుటుంబసభ్యులు

ప్రియుని ఇంటి వద్ద యువతి నిరసన

ప్రజాశక్తి - ఏలేశ్వరం

తనను నమ్మించి మోసం చేశాడని ఆరోపిస్తూ మండలంలోని సిరిపురం గ్రామంలో ప్రియుడి ఇంటి ఎదుట గురువారం ఓ యువతి నిరసన చేప ట్టింది. ఈ సందర్భంగా బాధిత యువతి వెంగళ సత్య శ్రీదేవి మాట్లా డుతూ తమ గ్రామానికి చెందిన కొండల శ్రీను మూడు సంవత్సరాల పాటు తనను ప్రేమించానని సహజీవనం సాగించి ముఖం చాటేశాడని ఆరోపించింది. పెళ్లి చేసుకోమంటే తమ పెద్దలు అంగీకరించడం లేదని తప్పించుకు తిరుగు తున్నాడని ఆవేదన వ్యక్తం చేసింది. శ్రీదేవి చేపట్టిన నిరసనకు కుటుంబ సభ్యులతో పాటు మరి కొంతమంది సంఘీభావం తెలిపారు. మోసగించిన యువకుడు శ్రీను తండ్రి, కుల పెద్ద అయినప్పటికీ ఈ విష యంలో తానేమి చేయలేనని చేతులెత్తేశాడని వారు ఆరోపిస్తున్నారు. తనకు న్యాయం జరగక పోతే శ్రీను ఇంటి ముందు ఆత్మహత్య చేసుకుంటానని శ్రీదేవి హెచ్చరిస్తోంది.

28న వాలంటర్లకు వందనం

పజాశక్తి - కాజులూరు

వాలంటీర్స్‌కు వందనం కార్యక్రమం ఆదివారం ఉదయం ద్రాక్షారమ పేపకాయల బాబ్జి కళ్యాణ మండపంలో ఉదయం 10 గంటలకు ఈ నెల 28న నిర్వహిస్తున్నామని ఎంపిడిఒ సిహెచ్ ఇందిరాదేవి తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వాలంటీర్ల సేవలను గుర్తించి ప్రభుత్వం సేవా వజ్ర, సేవా రత్న సేవా మిత్రులుగా విభజించి వారికి అవార్డులు అందజేస్తోందన్నారు. దీనిలో భాగంగా సేవా వజ్ర అవార్డులకు టి.మామిడాడకు చెందిన కోట జ్యోతి ఉప్పుమిల్లి గ్రామానికి చెందిన పందిరి రవిశంకర్, సేవా రత్న అవార్డులకు గొల్లపాలెం సచివాలయానికి చెందిన ముర్రే నానాజీ కుయ్యేరుకు చెందిన బొమ్మిడి నాగేశ్వరరావు గొల్లపాలెంకు చెందిన జొన్నకూటి సుభాష్ మంజేరుకు చెందిన విశాలి జగన్నాడగిరి చెందిన కంచి పద్మ శ్రీదేవి ఎంపికయ్యారని మిగిలిన వారికి సేవామిత్ర అవార్డు ఇవ్వనున్నట్లు తెలిపారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత 'నీలాద్రిరావు పేట'

ప్రజాశక్తి - గండేపల్లి:

మండలం నీలాద్రిరావుపేటలో జనసైనికుడు గండేపల్లి మండల సంయుక్త కార్యదర్శి కారుకొండ విజయ్ కుమార్ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన గత నెల రోజులుగా నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ ముగిసిన సందర్భంగా గురువారం నిర్వహించిన బహుమతి ప్రదాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జగ్గంపేట నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్‌చార్జ్ పాటంశెట్టి శ్రీదేవి సూర్య చంద్ర విజేతలకు బహుమ తులు అందజేశారు. 35 జట్ల మధ్య జరిగిన ఈ టోర్నమెంట్‌లో నీలాద్రిరావుపేట జట్టు విన్నర్ గాను, ఏలేశ్వరం జట్టు రన్నర్ గాను నిలిచి బహుమతులు అందుకున్నారు. విన్నర్ గా నిలిచిన నీలాద్రి రావుపేట క్రికెట్ టీమ్‌కు సూర్యచంద్ర, గ్రామ సర్పంచ్ ముల్లం పాక సురేష్‌లు విన్నర్ కప్, రూ.20వేలు అంద జేశారు.

సిసిఆర్‌సి కార్డుల పంపిణీ

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మండలం మరలావ గ్రామ రైతు భరోసా కేంద్రంలో గురువారం జరిగిన కౌలు రైతుల అవగాహన సదస్సులో ఎడిఎ నల్లి దైవ కుమార్‌కౌలు రైతులకు సిసిఆర్‌సి కార్డులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కౌలు రైతులందరూ ఈ కార్డులు తీసుకోవడం వల్ల ప్రభుత్వాల ద్వారా రైతులకు అందించే అన్ని సదుపాయాలు, పంట ఉత్పత్తుల అమ్మకం, ఎరువుల సబ్సిడీలు, పంట నష్టం, ఇన్పుట్ సబ్సిడీ పొందగలుగుతారన్నారు. ఇంకా మిగిలి ఉన్న కౌలు రైతులు రైతు భరోసా కేంద్రంలో పూర్తి వివరాలతో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణాధికారి ఎన్‌వి ప్రసాద్, విఆర్ఒ సుబ్రహ్మణ్యం, విఎఎ షేక్ బాలాజీ, వైస్ ఎంపిపి మిరియాల రాజా, కౌలు రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

మండలంలో పలు గ్రామాలుకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఎఇ జి.ప్రసాద్ గురువారం తెలిపారు చెట్లను తొలగించే పనుల నిమిత్తం యు.కొత్తపల్లి, వాకతిప్ప, కుతుకుడిమిల్లి,ఉప్పాడ, అమీనాబాద్, ఎండపల్లి, నాగులపల్లి గ్రామాలకు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1:30 వరకు విద్యుత్ నిలుపుదల చేయనున్నట్లు తెలిపారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

కామనగరువు పంచాయతీ 3, 5 వార్డులలో పంచాయతీ నిధులతో పలు రోడ్లను అభివద్ధి చేయుటకు సర్పంచ్ నక్కా అరుణకుమారి గురువారం భూమిపూజ చేశారు. తమ గ్రామాన్ని అబివృద్ధి పథంలో నడిపించడానికి నిత్యం శ్రమిస్తున్న సర్పంచ్ ను ఆయా వార్డు ప్రజలు అభినందించారు. రోడ్లను అభివృద్ధి చేస్తున్నందుకు అక్కడి ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యురాలు మెండు గంగాభవాని, వార్డు మెంబర్ గుత్తుల నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీ సమన్వయ సమావేశం

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట మండల స్థాయి ఉపాధి హమీ సామాజిక తనిఖీపై సమన్వయ సమావేశం శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ఎంపిడిఒ కార్యాల యంలో ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు ముఖ్య అతిధిగా నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ డి శ్రీలలిత చెప్పారు. ఈ సమావేశానికి జడ్‌పిటిసి, ఎంపిటీసీలు, గ్రామ సర్పంచ్‌లు ఎఇ పి.ఆర్, ఎఇ ఆర్‌డబ్ల్యుఎస్, ఎఇ హౌసింగ్, గ్రామ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు హాజరుకానున్నట్లు ఎంపిడిఒ శ్రీలలిత వివరించారు.

సమస్యలు ఉంటే నాతో చెప్పండి

- హోం గార్డుల గ్రీవెన్స్‌లో ఎస్‌పి సతీష్‌కుమార్

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

హోంగార్డులకు సమస్యలు ఉంటే ప్రతి సోమవారం నా దగ్గరకు వచ్చి వ్యక్తిగతంగా తెలుపవచ్చని, హోంగార్డులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని ఎస్పీ సతీష్ కుమార్ అన్నారు. గురువారం జిల్లా పోలీసు కార్యా లయం ఆవరణలో గల పోలీసు కళ్యాణ మండపంలో కాకినాడ జిల్లా హోమ్ గార్డ్స్ గ్రీవెన్స్‌పై ముఖాముఖీ కార్యక్రమం నిర్వహించారు. హోమ్ గార్డులకు ఏమైనా సమస్యలు ఉంటే ప్రతి సోమవారం సాయంత్రం 4:30 గంటలకు జిల్లా పోలీసు కార్యాలయంలో తన వద్దకు వచ్చి, వ్యక్తిగతంగా వారికి ఉన్న సమస్యలను తెలిపి, పరిష్కారం పొందవచ్చన్నారు. పోలీసు శాఖకు అనుబంధంగా పని చేస్తున్న హోం గార్డులకు ప్రస్తుతం నెల జీతం ప్రభుత్వమే చెల్లిస్తుం దన్నారు. హెూంగార్డులకు ప్రభుత్వ పోలీస్ శాఖ గ్రూప్ ఇన్సూరెన్స్ పథకాన్ని అమలు చేస్తోందని, ఏ విధమైన అనారోగ్య సమస్యలు ఏర్పడిన పోలీస్ శాఖ సహాయం చేస్తుందని, విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయి వారి కుటుంబ సభ్యు లకు కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇస్తున్నట్లు తెలిపారు. హెూంగార్డులను పోలీస్ శాఖ అన్ని విధాల ఆదుకుంటుందని, వారి పిల్లలకు చదువుల విష యంలో సహాయం కావాలంటే పోలీసు శాఖ సాయం చేస్తుం దని, ప్రతి హోమ్‌గార్డ్‌కు నెలకు రెండు రోజులు పర్మిషన్ మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎఎస్‌పిలు పి. శ్రీని వాస్, ఎస్.సత్య నారాయణ, ఆర్.ఐ. విజి శ్రీహరిరావు, హోమ్ గార్డ్స్ ఆర్.ఐ. పి.వెంకటఅప్పారావు, హోంగార్డులు పాల్గొన్నారు.

రాత్రి సమయంలో గస్తీ పెంచండి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

దొంగతనాలను నిరోధించేందుకు రాత్రి సమయాల్లో ప్రతి గ్రామాల్లోని గస్తిని పెంచాలని జిల్లా ఎస్‌పి సతీష్ కుమార్ ఇంద్రపాలెం ఎస్ఐ నాగరాజును ఆదేశించారు. గురువారం గాంధీనగర్‌ని ఇంద్రపాలెం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు పెండింగ్లో ఉన్న కేసుల పురోగతిపై ఎస్ఐని అడిగి తెలుసుకున్నారు. రహదారి ప్రమాదాలను నిరోధించేందుకు ప్రతిరోజు ముఖ్యమైన కూడాళ్లలో ట్రాఫిక్ నియంత్రణ, విజిబుల్ పోలీసింగ్ చేయాలన్నారు. ఆటో డ్రైవర్లకు, లారీ డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలని, ప్రమాదాల నివారించేందుకు గ్రామస్థాయిలో అవగాహన కార్యక్ర మాలు చేపట్టాలన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి సమస్యను పరిష్కరించేలా విధులు నిర్వహించా లన్నారు. ఎస్ఐ తో పాటుగా, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ భద్రతపై 'వారధి'

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

వాహనదారులు తప్పనిసరిగా రహదారి భద్రత నియమాలను పాటించాలని జగ్గంపేట ఎస్ఐ విద్యా సాగర్ తెలిపారు. గురువారం రాత్రి జగ్గంపేట మండలం రామవరంలో ఎస్‌పి ఎస్.సతీష్ కుమార్ ఆదేశాల మేరకు వారధి అనే నూతన కార్యక్రమంలో భాగంగా జగ్గంపేట సీఐ బి.సూర్య అప్పారావు, ఎస్ఐ విద్యాసాగర్ ఆధ్వ ర్యంలో రహదారి భద్రత, రోడ్డు ప్రమాదాల నియం త్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ మద్యం సేవించి మద్యం సేవించి వాహనం నడిపితే రూ.10 వేల జరిమానా విధిస్తామన్నారు. జరిమానా చెల్లించిన పక్షంలో ఒక నెల జైలు శిక్ష అనుభవించాలని వివరించారు. గ్రామస్తులు గ్రామ, పెద్దలు పాల్గొన్నారు.

పేదలకు ప్రభుత్వం అండ

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలం సుంకరపాలెం అంబేద్కర్ నగర్ కు చెందిన బొమ్మి బుజ్జి బాబు (48) అనారోగ్యంతో బుధవారం మృతి చెందగా వైయస్సార్ బీమాలో భాగంగా రూ.10వేల నగదును స్థానిక సర్పంచ్, మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షులు టిల్లపూడి నాగేశ్వరరావు మతుని భార్యకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న వైయస్సార్ బీమా లో భాగంగా మరో రూ. 90 వేలు నామిని ఖాతాకు త్వరలో జమవుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి గుత్తుల శ్రీను వాస్, పాఠశాల చైర్మన్ పలివెల రాము, మడికి సత్యనారాయణ, ఎం.గోపి, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ శివ, బొమ్మి నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కోట దేవస్థానం భూముల ఆక్రమణలపై ఫిర్యాదు

ప్రజాశక్తి రామచంద్రపురం

కె.గంగవరం మండలంలో కోట గ్రామ పంచాయతీ పరిధిలో గల రాజగోపాల స్వామి ఆలయ భూములు ఆక్రమణ గురవుతున్నాయని దేవాదాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు గురువారం విలేకరులకు వివి.రామరాజు తెలిపారు. దేవస్థానం లోవంట చేయుటకు పురాణ పానకాలచార్యులకి సర్వేనెంబర్ 328/2లో సుమారు 1 ఎకరం రెండు సెంట్లు వ్యవసాయ భూమిని దేవస్థానం కేటాయించింది. ఈ భూమిని ఇటీవలే కొంతమంది ఆక్రమించుకుని అక్రమంగా లే అవుట్లు వేస్తున్నారు. ఎండోమెంట్స్ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.

సాగులో యంత్రాల వినియోగంతో ఖర్చు ఆదా

ప్రజాశక్తి - ఆలమూరు

సాగులో యంత్రాలను వినియోగంతో ఖర్చు ఆదా అవుతుందని ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సచివాలయం-2 పరిధిలో వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా 40 శాతం రాయితీతో మంజూరైన రూ.14,55,500 విలువచేసే ఏడు క్రిషి ట్రాక్టర్లను ఆయన గురువారం అందజేశారు. శ్రీ కరుణ సిహెచ్‌సి గ్రూప్ సభ్యులకు రూ.4 లక్షల 90 వేల సబ్సిడీతో వీటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చిర్ల మాట్లాడుతూ కూలీలు దొరకక వ్యవసాయం ఆటుపోట్ల మధ్య కొనసాగుతుందని క్రిషి ట్రాక్టర్ల వంటి యంత్ర సామగ్రితో రైతులకు ఖర్చులు భారీగా తగ్గుతాయన్నారు. కార్యక్రమంలో ఎఓ సోమిరెడ్డి లక్ష్మి లావణ్య, నాయకులు, కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

మండుతున్న ఎండలు

ప్రజాశక్తి-రామచంద్రపురం

మండుతున్న ఎండలకు బెంబే లెత్తిపోతున్నారు. ఉదయం 11 గంటల నుంచి మెయిన్ రోడ్లన్నీ కర్ఫ్యూ వాతావరణం తలపిస్తు న్నాయి. మరోవైపు ఎండల వేడిమికి చిన్న పిల్లలు, వృద్ధులు తట్టుకోలేక తల్లడి ల్లుతున్నారు. గురువారం నుండి రోహిణి కార్తి ప్రవేశించడంతో కొద్ది రోజులు ఎండల తీవ్రత అధికంగా ఉంటాయని ప్రజలు అంటున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జ్యోతుల నవీన్

మహానాడు విజయవంతానికి పిలుపు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

మహానాడు విజయవంతం చేయాలని కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షుడు జ్యోతుల నవీన్ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ పత్రికా సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంటు నియోజకవర్గంలో ఉన్న అన్ని నియోజకవర్గ ఇన్చార్జ్‌లను మర్యాద పూర్వకంగా కలిసి 27, 28, తేదీల్లో రాజమహేంద్రవరం లో తెలుగు వారి ఆరాజ్య దైవం అన్న ఎన్టీఆర్ శత జయంతి, మహానాడు కార్యక్రమానికి తమ తమ నియోజకవర్గాల నుండి పార్టీ కార్యకర్తలను అభిమా నులను సభకు తీసుకురావాలని కోరారు. ప్రతి నియోజకవర్గం నుండి భారీగా అభిమానులు వేల సంఖ్యలో అభిమానులు తరలి వచ్చే అవకాశం ఉందని వచ్చిన ఏ ఒక్కరికీ అసౌకర్యం కలగకుండా మంచి నీరు, మజ్జిగ, భోజన, సౌకర్యాలు చూడాలని ఇన్చార్జ్‌లందరికి సూచించారు. ఈ ఎన్‌టిఆర్ శత జయంతి, మహానాడు చరిత్రలో కనీ వినీ ఎరుగని రీతిలో నభుతో నభవిషత్ అనే రీతిలో ఏర్పాట్లు చేసినట్లు నవీన్ మీడియా ద్వారా తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న ప్రతి పక్ష పార్టీలు ఏ కార్యక్రమం చేపట్టినా పట్టించుకునే వారు కాదని ప్రస్తుతం ఉన్న ఈ ప్రభుత్వం వారు రాష్ట్ర అభివృద్ధి కంటే ప్రతిపక్షాలు చేస్తున్న కార్యక్రమాలు అనచి వేయడమె లక్ష్యంగా పని చేస్తున్నారని ప్రభుత్వం ఎన్ని ఆంక్షలు అడ్డంకులు సష్టించినా మహానాడు విజ విజయవంతం చేయాలనే పట్టుదల ప్రజల్లో ఉందన్నారు.



మహానాడు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వరుపుల సత్యప్రభ, టిడిపి నాయకులు

మహానాడు పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఏలేశ్వరం

తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా ఈనెల 27, 28 తేదీల్లో నిర్వహిస్తున్న మహానాడుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ప్రతిపాడు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ వరుపుల సత్యప్రభ రాజ పిలుపు నిచ్చారు. ఈ మేరకు ప్రతిపాడు మండలం పెద్ద శంకర్లపూడి పార్టీ కార్యాలయంలో మహానాడు పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, విశ్వవిఖ్యాత నటసార్వభౌమ నందమూరి తారక రామారావు 100వ జయంతి కావడంతో మహానాడుకు మరింత ప్రత్యేకత ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహానాడును జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

రాజమహేంద్రవరంలో ఈనెల 27, 28 తేదీల్లో జరగనున్న తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమాన్ని పురస్కరించుకొని తాళ్లరేవు లయన్స్ క్లబ్ హాల్లో మండల స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కట్టా త్రిమూర్తులు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వ హించనున్న సమావేశానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు విధిగా హాజరై సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ నగరంలో అస్తవ్యస్త ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషన్ ఆర్. మహేష్ కుమార్ ఆదేశించారు. కమిషనర్ అధ్యక్షతన టు టౌన్ నుండి జగన్నాధపురం బ్రిడ్జ్ వరకు గల భవన యజమానులు సెల్లార్‌లో పార్కింగ్ నిమిత్తం ప్లాను అనుమతి పొంది, పార్కింగ్‌కు వినియోగించకుండా వ్యాపారాలు చేసే 54 షాపింగ్ కాంప్లెక్స్‌లను గుర్తించి సదరు యాజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిటీ ప్లానర్ కె.హరిదాస్ మాట్లాడుతూ సెల్లార్ నందు పార్కింగ్‌కు వినియోగించుటకు చర్యలు ఏమి తీసుకొంటున్నారో తెలపమన్నారు. ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మెయిన్ రోడ్డులో పేయిడ్ పార్కింగ్ విధానం అమలు చేయుట వలన ట్రాఫిక్‌ను నియంత్రించవచ్చునని మెయిన్ రోడ్డుకు వచ్చినపుడు ట్రాఫిక్ రూల్స్ ప్రకారం పార్కింగ్ చేసుకోవాలన్నారు. అనం తరం షాప్ యజమానులు మాట్లాడుతూ ఫుట్‌పాత్ నుండి రేంప్ ఏర్పాటు చేస్తే మా సెల్లార్‌లో పార్కింగ్ ఏర్పాటు కు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మెయిన్ రోడ్డులో ఖాళీ స్థలాలను గుర్తించి ఆ స్థల యాజమానుల అనుమతితో పార్కింగ్ ఏర్పాటు చేస్తే కొంత సమస్య తీరుతుందని పలు సూచనలు చేశారు. సెల్లార్‌లో పార్కింగ్‌కు మాత్రమే వినియోగించేలా దుకాణ దారులు త్వరిత గతిన ఏర్పాట్లు చేసుకోవాలని, అలా కాకుండా ఇతర విని యోగములకు ఉపయోగించి నట్లైతే ఇకపై తీవ్రమైన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ సిటీ ప్లానర్, కమిషనర్ మహేష్‌కుమార్ షాపు యజమానులను ఆదేశించారు. సమావేశంలో ట్రాఫిక్ పోలీసు అధికారుల, టౌన్‌ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

వంట గ్యాస్ లీకై గృహోపకరణాల దగ్ధం

ప్రజాశక్తి-మండపేట

వంట గ్యాస్ లీకై గృహోపకరణాలు ధ్వంసమయ్యాయి. ఈ సంఘటన గురువారం చోటు చేసుకుంది. ఏడిద గ్రామ జమ్మిచెట్టు వీధిలోని కామన కృష్ణ ఇంటి పైఅంతస్తులో వంట గ్యాస్ సిలిండర్ మారుస్తున్న సమయంలో రెగ్యులేటర్ నుంచి ఒక్కసారిగా గ్యాస్ లీకవడంతో భయంతో పరుగులు తీశారు. గ్యాస్ పైఅంతస్తు అంతా వ్యాపించి మంటలు చెలరేగి గృహోపకరణాలతో పాటు తలుపులు కిటికీ అద్దాలు ధ్వంసం అయ్యాయి. చుట్టుపక్కల వారు స్వల్పంగా గాయపడ్డారు. సమా చారం అందుకున్న మండపేట అగ్నిమాపక సిబ్బంది జె.హను మంత రావు ఆధ్వర్యంలో సిబ్బంది మంటలు అదుపు చేశారు.

ఎన్‌టిఆర్ విగ్రహం ఆవిష్కరణ

ప్రజాశక్తి-కొత్తపేట



కార్యక్రమంలో పాల్గొన్న అచ్చన్నాయుడు తదితరులు

ఎన్‌టిఆర్ శత జయంతి ఉత్సవాలను పురస్కరిం చుకుని గురువారం వాడపాలెంలోని ఆయన విగ్ర హాన్ని ఏర్పాటు చేశారు. ఎన్‌టిఆర్ విగ్రహాన్ని గురువారం రాష్ట్ర అధ్యక్షుడు కింజవరపు అచ్చ నాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి పాలనలో టిడిపి నాయకులను కార్యకర్తలను ఎన్ని ఇబ్బందులు పెట్టిన నాలుగున్నర సంవత్సరాల భరాయించామన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి కొత్తపేట నియోజకవర్గ ఇన్చార్జ్ బండారు సత్యానందరావు, శాసనసభ మాజీ డిప్యూటీ ఛైర్మన్ రెడ్డి సుబ్రమణ్యం, రెడ్డి అనంత కుమారి, గంటి హరీష్ మాథుర్ తదితర నాయకులు పాల్గొన్నారు

వాటర్ ట్యాంక్ ప్రారభం

ప్రజాశక్తి -కరప

కరప మండలం కూరాడ గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభోత్సవం చేశారు. గురువారం గ్రామంలోని 43లక్షల రూపాయల జల జీవన్ మిషన్ నిదులతో నూతనంగా నిర్మించిన వాటర్ ట్యాంక్, ఇంటింటికి కుళాయి కనెక్షన్లు, నూతనంగా నిర్మించిన సొసైటీ భవనం ప్రారంభోత్సవం చేశారు. అనంతరం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎంపిపి పి. శ్రీ లక్ష్మీ సత్తిబాబు, గ్రామ సర్పంచ్ వాసంశెట్టి వెంకటరమణ, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు రావుల ప్రసాద్, ఎం.సత్తిబాబు, చింత ఈశ్వరరావు, ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు.

30 నుంచి మినీ ఒలింపియాడ్

ప్రజాశక్తి - కాకినాడ

క్రీడాకారులను ప్రోత్సహించే దిశగా ఈ నెల 30,31వ తేదీల్లో రెండు రోజుల పాటు 12వ జిల్లా మినీ ఒలింపియాడ్-2023 నిర్వహిస్తున్నట్టు ఒలింపియాడ్ నిర్వాహక కమిటీ అధ్యక్షుడు డాక్టర్ ముత్తా నవీన్, కోఆర్డినేటర్ కె.పద్మనాభం గురువారం తెలిపారు. సెంట్రల్ ఆర్గనైజింగ్ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు కీ.శే. ఎస్.శ్రీరామరాజు జ్ఞాపకార్థం ఈ 12వ మినీ ఒలింపియాడ్‌లో 14సంవత్సరాల లోపు బాలబాలికలకు వారి వేసవి శిక్షణా శిబిరాలలో పోటీలు వుంటాయని తెలిపారు. సామర్లకోటలో కబడ్డీ, కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో జిమ్నాస్టిక్స్, తెక్వాండో, హాకీ, వైట్ లిఫ్టింగ్, షటిల్ బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్, అథ్లెటిక్స్, జగ్గంపేటలో జూడో, తాటిపాకలో బాక్సింగ్, రాజోలులో చెస్, పిఠాపురం, రావులపాలెంలలో ఆర్చరీ, హెలికాన్ టైమ్స్‌లో స్విమ్మింగ్, స్క్వాష్ ఉంటాయని తెలిపారు. క్రీడల్లో విజేతలకు ఈ నెల 31వ తేదీన బహుమతి ప్రదానం చేస్తాని తెలిపారు. ఈ అవకాశం క్రీడాకారులు వినియోగించుకోవాలని సూచించారు.

రోడ్డు ప్రమాదాల నివారణ కృషి చేయాలి

27న అవగాహనా సదస్సు : ఎంపిపి సునీత

ప్రజాశక్తి - తాళ్లరేవు

తాళ్లరేవు మండల పరిధిలోని జాతీయ రహదారి 216పై జరుగుతున్న ప్రమాదాలను నివారించే దిశగా ఈ నెల 27 శనివారం ఉదయం తొమ్మిది గంటలకు తాళ్లరేవు మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎంపిపి రాయుడు సునీత గురువారం తెలియజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ చొల్లంగి నుండి ఎదుర్లంక వంతెన వరకు నిర్మించిన జాతీయ రహదారి రోడ్డు నిర్మాణం ప్రారంభించినప్పటి నుండి ఇప్పటివరకు వందలాది మంది రోడ్డు ప్రమాదాల్లో మరణించారన్నారు.దీనిపై హైవే అధికారులు, ఆర్ అండ్ బి అధికారులు, పోలీసు అధికారులు, వాహనదారుల సంఘాల నాయకులు, ప్రజాప్రతి నిధులు, ప్రజాసంఘాల నాయకులు, అన్ని రాజకీయ పార్టీల నాయ కులు, అందరం కలిసి చర్చించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రభుత్వం ద్వారా తీసుకోవలసిన చర్యలతో పాటు ప్రజలలో అవగాహన తీసుకురావడం కోసం మనందరం కృషి చేయాలనే ఉద్దేశ్యంతో ఈ సదస్సు నిర్వహిస్తున్నా మన్నారు. ఈ సదస్సుకు పార్టీలకతీతంగా అందరూ హాజరై సూచనలు సలహాలు ఇచ్చి ఐకమత్యంగా రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు.

ట్రిపుల్ ఆర్ కలెక్షన్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక క్రిస్టియన్ పేటలోని 5వ సచివాలయంలో ఏర్పాటుచేసిన ట్రిపుల్ ఆర్ కలెక్షన్ కేంద్రాన్ని గురువారం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ ప్రారంభించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ జె సురేంద్ర అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ జూన్ 5 వ తేదీన జరిగే ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణ పరిధిలోని 14 సచివాలయాల వద్ద ఏర్పాటుచేసిన పనికిరాని ప్లాస్టిక్ వస్తువులు, పుస్తకాలు, అట్టలు, జోళ్లు, బూట్లు తదితర వస్తువుల సేకరణకు సంబంధించి ఏర్పాటు చేసిన కలెక్షన్ పాయింట్లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. మున్సిపల్ కమిషనర్ సురేంద్ర మాట్లాడుతూ జూన్ 4వ తేదీ వరకు అన్ని సచివాలయాల పరిధిలో ప్రజలకు ఈ విధానాలపై, వీటి ఉపయోగాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదు రాజు మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయం వెనుక ఆవరణలో కూడా ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. కౌన్సిలర్లు ఆరేళ్ల వీరరాఘవ, బలుసు కనకం, గుర్రాల మార్త, గుర్రాల యాకోబు, చింతా శ్రీనివాసరావు, సచివాలయం అడ్మిన్ జివివి రమణ పాల్గొన్నారు.

లారీ డ్రైవర్ ఆత్మహత్య

ప్రజాశక్తి-రావులపాలెం

రావులపాలెం మండలం ఈతకోట సమీపంలో ఒక లారీ డ్రైవర్ లారీ క్యాబిన్ కు ఉరి వేసుకుని చనిపోయాడు. వివరాలు ఇవి.. ఏలూరు జిల్లా భీమడోలు మండలం అంబర్ పేటకు చెందిన పట్టా ప్రసాద్(30) లారీ డ్రైవర్ గా పనిచేస్తున్నాడు. అయితే రావులపాలెం మండలం ఈతకోట టోల్గేట్ సమీపంలో జాతీయ రహదారి పక్కన లారీ క్యాబిన్ పైభాగానికి తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం తెల్లవారుజామున ఈ సంఘటన చోటు చేసుకున్నట్లు భావిస్తున్నారు. గురువారం ఉదయం స్థానికులు ఈ సంఘటనను గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. రావులపాలెం ఎస్ఐ వెంకట రమణ ఆధ్వర్యంలోని పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చేనేత వస్త్రాల ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో గురువారం చేనేత కార్మిక నాయకులు గొల్ల అచ్చారావు విద్యార్థులకు చేనేత వస్త్రాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. చేనేత దారం తయారీ నుంచి చేనేత వస్త్రం తయారయ్యేంతవరకు చేనేత పరిశ్రమలో జరిగే పరిణామ క్రమాన్ని, ప్రతి విభాగంలో చేనేత కార్మికుల నైపుణ్యాన్ని విద్యార్థులకు వివరించారు. పెద్దాపురం పట్టణంలో పురాతన కాలం నుండి చేనేత పరిశ్రమ అభివద్ధికి జరిగిన కృషిని వివరించారు. అనంతరం విద్యార్థులకు స్వచ్ఛభారత్ అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి పాలంకి నాగరాజు, సిబ్బంది బుల్లయ్య, పాఠకులు పాల్గొన్నారు.